క్లుప్తంగా

ప్రో కబడ్డీకి కల్లూరు వాసి ఎంపిక



అనిల్‌యాదవ్

నేరేడుచర్ల : యువ తెలంగాణ ప్రో కబడ్డీకి సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన సంకబుడ్డి అనిల్ యాదవ్ ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన సంకబుడ్డి పద్మ –గోపి యాదవ్ దంపతుల కుమారుడు అనిల్ యాదవ్‌కు చిన్నప్పటి నుంచి కబడ్డీ మీద ఆసక్తితో చిన్న చిన్న టోర్నమెంట్‌లలో పాల్గొంటూ తన ప్రతిభను చాటుతూ వస్తున్నాడు. అతడి ప్రతిభను గుర్తించిన తెలంగాణ బోర్డు రాష్ట్రం తరఫున ఆడించి యువ తెలంగాణ ప్రో కబడ్డీకి ఎంపిక చేసింది. అనిల్ యాదవ్ ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


గురుకుల పాఠశాలలో దోమల మందు పిచికారీ చేయిస్తున్న అధికారులు

నడిగూడెం : వానాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పల్లె దావాఖాన వైద్యాధికారి డాక్టర్ హరినాథ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మలేరియా, డెంగ్యూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం పాఠశాలలో దోమల మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్.వాణి, సబ్ యూనిట్ అధికారి సురేందర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శారద, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ఏఎస్‌ఎంలు సుజాత, రాధ, నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు సైదమ్మ, సునిత, లక్ష్మి పాల్గొన్నారు.

కార్మికులను మోసగిస్తున్న బీజేపీ ప్రభుత్వం


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకుడు యాకూబ్

గరిడేపల్లి : కార్పొరేట్, మతోన్మాదుల ప్రయోజనాల కోసం బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజానీకాన్ని, కార్మిక వర్గాన్ని మోసగిస్తోందని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కె యాకూబ్ ఆరోపించారు. ఆదివారం గరిడేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఇటుకల తయారీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలపై కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. రాజ్యాంగ హక్కులకు పూర్తిగా భిన్నంగా వెళ్తోందని అన్నారు. బీజేపీ అనుసరించే విధానాలకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో ఐక్య ఉద్యమాలు చేసి సరైన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వీరస్వామి, శ్రీను, బాలు, శివపార్వతి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రోడ్డుకు మరమ్మతులు


జెర్రిపోతులగూడెం - రాయినిగూడెం రోడ్డుకు మరమ్మతులు చేసిన ట్రస్ట్ సభ్యులు

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెం నుంచి రాయినిగూడెం వెళ్లే రోడ్డును కంపచెట్లు కమ్మేసి అధ్వానంగా తయారై ప్రజల రాకపోకలకు ఇబ్బంది మారింది. దీంతో ఆదివారం గ్రామానికి చెందిన మౌలానా మైబుబి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ముందుకొచ్చి రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు తొలగించి గుంతలు ఉన్న చోట చదును చేసి మరమ్మతులు చేశారు. కార్యక్రమంలో సభ్యులు పారెపల్లి నాగన్న, రెడపంగు మహేష్, ఐనుద్దీన్, మాతంగి నవీన్, మాతంగి సైదులు, నరేష్, రాజేష్, రాజు, పాషా, కిరణ్, నూరోద్దిన్, హరీష్, బషీర్, అక్బర్, జానీ, ఖైఫ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకన్న మృతి

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వల్లెపు వెంకన్న (52) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. వల్లెపు వెంకన్న మృతదేహాన్ని పలువురు నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గుండు శ్రీనివాస్, నాయకులు పందిరి వెంకటరెడ్డి, పల్లపు శ్రీనివాస్, వల్లెపు శ్రీనివాస్ ఉన్నారు.

నాణ్యతపై పట్టింపేది!

- అంగన్‌వాడీ భవన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు కరువు
- గోడలకు క్యూరింగ్ చేయలేదని, ఒండ్రుమట్టి కలిసిన ఇసుకతో స్లాబ్ వేశారని స్థలదాత ఆరోపణ
- విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన


గుడిబండలో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనం

కోదాడరూరల్ : మండలంలోని గుడిబండలో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని స్థల దాత ఆరోపిస్తున్నాడు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే దాదాపుగా ఏడాది క్రితం జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి రూ.12 లక్షల నిధులను మంజూరు చేయించారు. కానీ భవన నిర్మాణానికి స్థలం లేదు. దీంతో స్థలం ఇచ్చేందుకు దాతలు ముందుకు రావాలని కోరడంతో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎరగాని రమణమ్మలక్ష్మయ్య దంపతులు తనకున్న స్థలంలో సుమారు రూ.7లక్షల విలువైన 120 గజాల స్థలాన్ని అంగన్‌వాడీ భవనం నిర్మించేందుకు విరాళంగా ఇచ్చారు. దీంతో నాలుగు నెలల క్రితం భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అయితే భవన నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని దాత లక్ష్మయ్య ఆరోపిస్తున్నారు. బేస్‌మెంట్ మొదలు నుంచి భవన గోడలు నిర్మించే వరకు క్యూరింగ్ చేయలేదని అంటున్నారు. స్థానికంగా వాగులో దొరికే ఒండ్రు మట్టి కలిసిన ఇసుకతో స్లాబ్ వేశాడని చెబుతున్నాడు. పనుల్లో నాణ్యత పాటించాలని అనేకసార్లు కాంట్రాక్టర్‌ను కోరినా పట్టించుకోలేదని తెలిపారు. సంబంధిత ఏఈకి తెలిపినా ఫలితం లేదని ఆరోపిస్తున్నాడు. అంగన్‌వాడీ భవనం నిర్మిస్తే ప్రభుత్వానికి, చిన్నారులకు మేలు చేసినవారమవుతామని భావించి స్థలాన్ని విరాళంగా ఇచ్చామని, కానీ భవనాన్ని నాణ్యతగా నిర్మించకపోతే తన ఆశయం నెరవేరదనే బాధ కలుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

గోడలకు క్యూరింగ్ చేయలేదు


చిన్నారులకు సౌకర్యంగా ఉంటుందని అంగన్‌వాడీ భవనం నిర్మించేందుకు స్థలాన్ని విరాళంగా ఇచ్చాం. కనీసం ముప్పైఏళ్లు ఉండాల్సిన భవనం.. కాంట్రాక్టర్ కట్టే విధానాన్ని చూస్తే ఎన్ని సంవత్సరాలు నిలుస్తుందో కూడా అర్థం కావడం లేదు. గోడలకు నీరుకొట్టమని ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదు. నేను హైదరాబాద్ వెళ్లినప్పుడు ఒండ్రుమట్టి కలిసిన ఇసుకను తీసుకొచ్చి స్లాబ్ వేశాడు.

– ఎరగాని లక్ష్మయ్య, స్థల దాత

నాణ్యత పాటించకపోతే బిల్లులు నిలిపివేస్తాం

గుడిబండలో అంగన్‌వాడీ భవనం నిర్మాణంలో భాగంగా స్లాబ్ వేయడానికి వాడిన ఇసుకలో రాళ్లు ఉంటే జల్లెడ పట్టించాం. పనులు పూర్తయిన తర్వాత క్వాలిటీ కంట్రోల్ పరీక్షలో నిబంధనలు పాటించలేదని తేలితే బిల్లులు నిలిపివేస్తాం.

– జి.రాము, పీఆర్ ఏఈ, కోదాడ

స్వామివార్ల విగ్రహాలకు జలాభిషేకం


జలబిందెలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మునగాల : మండల కేంద్రంలో సీతాలమ్మ సమేత మడేలయ్య, పోతరాజు దేవాలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు ఆలయ నిర్మాణ కమిటీ, రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రెండవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా రజక ఆడపడుచులు తలపై జలబిందెలు పెట్టుకొని డప్పుచప్పులు, మేళతాళాలతో ఊరేగింపుగా మడేలయ్యస్వామి దేవాలయానికి చేరుకొని సీతాలమ్మ, మడేలయ్య, పోతురాజుస్వామి విగ్రహాలకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు ముక్కొళ్ల వెంకటేశ్వరరావు, కమిటీ అధ్యక్షుడు తంగెళ్ల నాగేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులకు శంకుస్థాపన

చివ్వెంల : అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గ్రామానికి చెందిన షేక్ చాంద్ పాషకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేదల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధరావతు వీరన్న నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, వెన్న మధుకర్‌రెడ్డి, ఎండీ జాఫర్, కొణతం అప్పిరెడ్డి, నంద్యాల సోమిరెడ్డి, సమ్మయ్య, రఫీ, దావూద్, తదితరులు పాల్గొన్నారు.

వదర నీటిలోనే లోతట్టు ప్రాంతాలు


రత్నవరం వద్ద వరద తాకిడికి దెబ్బతిన్న కల్వర్టు


నడిగూడెంలోని బీసీ కాలనీలో ఇంటి చుట్టూ నిలిచిన వరద నీరు

నడిగూడెం : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదలతో అతలాకుతలమైన నడిగూడెం మండలం ఇంకా కోలుకోలేదు. చెరువులు అలుగు పోస్తూనే ఉన్నాయి. వదరలకు రత్నవరం వద్ద ఉన్న కల్వర్టు దెబ్బతినడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. పొలాలు నీట మునిగే ఉన్నాయి. మండల కేంద్రంలోని చౌదరి చెరువు అలుగు పోస్తుండడంతో లోతట్టు ప్రాంతం, వాగు పరీవాహక ప్రాంత ప్రజల ఇళ్లు నీటిలోనే ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని నష్టపోయిన రైతులు, వరద బాధితులు కోరుతున్నారు.

వాగులో పడిన వ్యక్తిని కాపాడిన యువకుడు..

మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీల మధ్య ఉన్న వాగుపై ఉన్న కల్వర్టు మీదుగా నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. శనివారం రాత్రి తెల్లబల్లికి చెందిన వెంకన్న అనే వ్యక్తి ఆ కల్వర్టు మీదుగా బైక్‌పై వెళ్తూ వరద ప్రవాహానికి వాగులో పడి మునుగుతుండడంతో గమనించిన నడిగూడెంకు చెందిన సీమ ప్రభుదాసు అనే యువకుడు వాగులోకి దూకి ఆ వ్యక్తిని కాపాడాడు.

భక్తిశ్రద్ధలతో బోనాల మహోత్సవం

చిలుకూరు : చిలుకూరు మండల కేంద్రంతో పాటు రామాపురం గ్రామాల్లో ఆదివారం ముత్యాలమ్మ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి, బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు బోనాలను తలపై ఎత్తుకొని ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండలంలోని ఎల్బీనగర్, కోదండరాంపురం, రాయినిగూడెం గ్రామాల్లో ఆదివారం ముత్యాలమ్మ బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. యేటపోతులు, కోళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం ముత్యాలమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


చిలుకూరులో బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నీడనిస్తూ.. ఆహ్లాదాన్ని పంచుతూ

- రోడ్డుకు ఇరువైపులా పచ్చని తోరణంలా హరితహారం చెట్లు

మఠంపల్లి : మండలంలోని అల్లీపురంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా ఐదేళ్ల క్రితం రోడ్డు వెంట నాటిన వందలాది మొక్కలు ఏపుగా పెరిగి బాటసారులకు నీడనిస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడుతున్నాయి. నాటి గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేందర్‌రెడ్డి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గోపయ్యలు అల్లీపురం గ్రామానికి ముందు సుమారు ఒక కిలోమీటరు దూరంలో మొక్కలు నాటించి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సంరక్షించారు. దీంతో చెట్లు రోడ్డుకు ఇరువైపులా పచ్చని స్వాగత తోరణంలా ఆహ్లాదాన్ని పంచుతూ కనువిందు చేస్తున్నాయి.


అల్లీపురం రోడ్డులో ఇరువైపులా ఏపుగా చెట్లు

పూర్వవిద్యార్థుల చేయూత

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన రామిడి లక్ష్మారెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో అత డు ఆస్పత్రుల్లో వైద్యఖర్చుల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అనంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997–98 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు తోటి మిత్రుడికి ఆర్థికసాయం అందజేసేందుకు ముందుకువచ్చారు. లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులకు ఆదివారం రూ. 50వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ హుస్సేన్, ఐతరాజు సాగర్, బైరెడ్డి మట్టారెడ్డి, దండెంపల్లి భాస్కర్‌గౌడ్, షేక్ ఇమాంపాష, గుడిపూడి నరేష్, షేక్ జానిపాష, రాచూరి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

విలియం కేరి జయంతి

సూర్యాపేట : సమాజంలోని దురాచారాలను నిర్మూలించేందుకు కృషి చేసిన గొప్ప దైవజనులు డాక్టర్ విలియం కేరి అని బిషప్ దుర్గం ప్రభాకర్ అన్నారు. ఆదివారం శాంతినగర్ బేతెస్త మినిస్ట్రీస్ క్యాంపస్‌లో విలియం కేరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విలియం కేరి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రంలో జలగం జేమ్స్, ఇంజమూరి గాబ్రియేల్, జాటోత్ డేవిడ్ రాజు, కొర్నెలి పాల్, అపోలో పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షకు బీసీలు కదిలిరావాలి

మిర్యాలగూడ టౌన్ : బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో చేపట్టబోయే సత్యాగ్రహ దీక్షకు తరలిరావాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ పిలుపునిచ్చారు. ఆదివారం మిర్యాలగూడలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు బీసీలపై ఒక్కసారిగా ఎనలేని ప్రేమ చూపిస్తున్నాయని, గత ఎన్నికల్లో ఇవే పార్టీలు బీసీలను చిన్నచూపు చూశాయని ఆరోపించారు. బీసీలపై అన్ని రాజకీయ పార్టీలకు ప్రేమ ఉంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని గెలిపించాలని, లేదా అన్ని రాజకీయ పార్టీలు కలిసి బీసీని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలన్నారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కావాలని గత 50 ఏళ్లుగా రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సత్యాగ్రహ దీక్షకు ప్రతి ఇంటి నుంచి ఒక బీసీ కదిలిరావాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు చిలకల మురళీయాదవ్, గంగాధర్, రాయంచు నర్సింహ, నరేష్, సతీష్, వెంకట్ తదితరులు ఉన్నారు.

కనువ పండువగా ముత్యాలమ్మ పండుగ

- ముత్యాలమ్మకు బోనాల సమర్పణ
- పట్టణంలో ప్రభబండ్ల ఊరేగింపు
- అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసిన మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు


ముత్యాలమ్మ ఆలయంలో మంత్రి ఉత్తమ్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


ఆలయం వద్ద భక్తుల సందడి

హుజూర్‌నగర్ : పట్టణంలో ముత్యాలమ్మ పండుగ ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మహిళలు, యువతులు, చిన్నారులు బోనాలు తలపై ఎత్తుకుని ఆలయానికి వెళ్లి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పలువురు కోళ్లు, మేకలు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోలాహలంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. సాయంత్ర రైతులు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లపై ప్రభలను కట్టుకుని వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తైబజారులతో ఆలయం పరసర ప్రాంతాలు కళకళలాడాయి. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకటరెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు, శానంపూడి సైదిరెడ్డి, కాంగ్రెస్, సీపీఐ, బీజేపీ నాయకులు, అధికారులు, ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమాలలో ఆలయ నిర్మాణ, నిర్వహణ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖశాంతులతో విలసిల్లాలి : మంత్రి

హుజూర్‌నగర్ : ముత్యాలమ్మ ఆశీస్సులతో ప్రజలు సుఖశాంతులతో విలసిల్లాలని, పాడి పంటలు బాగా పండాలని రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో ప్రారంభమైన ముత్యాలమ్మ జాతరలో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిని ఆలయ నిర్మాణ, నిర్వహణ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. అమ్మవారి దయతో ప్రాజెక్టులు నిండి రైతులకు సాగునీరు పుష్కలంగా లభిస్తుందని తెలిపారు. రైతులు, రైతు కూలీలు పాడి పంటలతో ఆనందంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు చెప్పారు. తల్లిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా ఉన్న ప్రతిసారి ఆలయంలో సౌకర్యాలు పెంపొందించేందుకు కృషి చేశానని, ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు. ఇటీవల కాలంలో ఆలయానికి పది లక్షలు మంజూరు చేశానని, ప్రస్తుతం ఆలయ అభివృద్ధికి మరో పది లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్, తన్నీరు మల్లికార్జున్, కోతి సంపత్‌రెడ్డి, శివరాం యాదవ్, వెల్లండ వీరారెడ్డి, ఆదెర్ల శ్రీనివాసరెడ్డి, జక్కుల మల్లయ్య, హరిబాబు, రాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి


పూజలో ఎమ్మెల్సీ సత్యం, మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకటరెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు

పెంపుడు శునకానికి అంత్యక్రియలు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెంలో అల్లారు ముద్దుగా పెంచుకున్న పెంపుడు శునకం మృతి చెందడంతో ఆదివారం సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామానికి చెందిన కాలే సామియేలు –జయమ్మ దంపతులు 14 ఏళ్ల క్రితం ఓ శునకాన్ని తెచ్చుకున్నారు. దానికి లక్కీ అనే పేరు పెట్టి కుటుంబసభ్యుడిగా పెంచుకుంటున్నారు. ఆదివారం లక్కీ అనారోగ్యానికి గురై మృతిచెందింది. దీంతో సామియేలు కుటుంబసభ్యులు కన్నీరు పెట్టుకున్నారు. మనిషికి చేసే విధంగా బ్యాండ్ భాజాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.


పెంపుడు శునకం మృతదేహానికి నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు

టీజీఎంఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రమావత్ రాజా

మిర్యాలగూడ : తెలంగాణ మీసేవా ఫెడరేషన్ (టీజీఎంఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడిగా మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన రమావత్ రాజా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ మీసేవా ఫెడరేషన్ సభ్యుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరా శంకర్ చేతుల మీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ.. జిల్లాలో ఆధార్, మీ సేవా కేంద్రాల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీసేవా సంఘం సభ్యులు మోహిత్, బాలరాజు, ముఖేష్, వినోద్, క్రాంతి, వెంకటేశ్వర్లు, రహీం, రమేష్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, అంజి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత జీవితాలను నాశనం చేసుకోవద్దు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సైదులు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రభాకర్

అర్వపల్లి : యువత మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ ఈట సైదులు కోరారు. మద్దిరాల మండలం గోరెంట్ల ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అర్వపల్లిలో ఆదివారం మద్యం, డ్రగ్స్ వద్దు.. ఆరోగ్యమే ముద్దు అనే ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ మైకుతో ప్రచారం నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం, ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్స్ ప్రాణాంతకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐలు రామకోటి, రాములు, పోలీస్ సిబ్బంది రమణ, అశోక్, సతీష్, స్థానికులు దిర్శనపు కృష్ణమూర్తి, ఎల్లంల కొమిరెల్లి, చంద్రశేఖర్, శైలేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణం

- మూడేళ్లుగా సాగుతున్న పనులు
- బిల్లులు రావడం లేదని పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్
- త్వరితగతిన పూర్తిచేయాలని కోరుతున్న గ్రామస్తులు


తొగర్రాయిలో అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం భవనం


అద్దెభవనంలో విధులు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని తొగర్రాయిలో ఆరోగ్య ఉపకేంద్రం నూతన భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి మూడేళ్లవుతున్నా పనులు పూర్తికాలేదు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసిబ్బంది మెరుగైన వైద్యం అందించాలంటే గ్రామాల్లో విధులు నిర్వహించేందుకు భవనాలు లేవు. దీంతో ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద తొగర్రాయిలో భవన నిర్మాణానికి రూ.16 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. భవనం నిర్మాణానికి మూడేళ్ల కిందట నాటి ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. సకాలంలో పనులు పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నేటికీ పనులు పూర్తి కాలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. స్లాబ్ వేసి గోడలు నిర్మించి ఆ తర్వాత బిల్లులు రావడం లేదని, కేటాయించిన నిధులు సరిపోవని కాంట్రాక్టర్ పనులు చేయకుండా మధ్యలోనే వదిలేశాడని గ్రామస్తులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు, నాయకులు కలగజేసుకొని భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేవిధంగా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అద్దె భవనంలో వైద్యసేవలు..

తొగర్రాయిలో ఆరోగ్య ఉపకేంద్రం భవనం లేకపోవడంతో వైద్య సిబ్బంది పాత గ్రామపంచాయతీ కార్యాలయంలోని ఓ గదిలో చాలారోజులుగా విధులు నిర్వహించారు. అది కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని కూల్చివేశారు. దీంతో గ్రామంలో ఓ అద్దె ఇంట్లో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని విధులు నిర్వహిస్తున్నారు.

అందుబాటులోకి తేవాలి

గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణ పనులు మూడేళ్ల కిందట ప్రారంభమయ్యాయి. నాటి నుంచి కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయలేదు. భవనం లేకపోవడంతో వైద్యారోగ్య సిబ్బంది, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో వెంటనే పనులు పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– అమరనాయని వెంకటేశ్వరరావు

భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేస్తాం

బిల్లులు విడుదల కాకపోవడంతో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులు చేపట్టలేకపోతున్నామని కాంట్రాక్టర్ అంటున్నాడు. బిల్లులు రాగానే పనుల్లో వేగం పెంచి పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. భవనం పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

– ప్రశాంత్, టీఎస్‌ఎం ఐడీసీ ఏఈ, కోదాడ